సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025

4 నెలలు 10.18 లక్షల ప్రయాణికులు

- ప్రయాణికుల రాకపోకల్లో వృద్ధి సాధిస్తున్న విశాఖ ఎయిర్‌పోర్టు
- 2024 జనవరితో పోలిస్తే 32 శాతం పెరిగిన స్వదేశీ ప్రయాణికులు
- దేశీయ విమాన సర్వీసుల్లోనూ 32 శాతం వృద్ధి
- విదేశీ ప్రయాణికులు, సర్వీసుల్లో ఏకంగా 110 శాతం పెరుగుదల



సాక్షి, విశాఖపట్నం : శీతాకాలం సీజన్‌లో ప్రయాణికులతో పాటు పర్యాటకుల తాకిడి పెరగడంతో విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం కళకళలాడుతోంది. విశాఖ నుంచి రాకపోకలు సాగించే వారి సంఖ్య ఊపందుకోవడంతో విమాన సర్వీసులు రివ్వురివ్వున సాగిపోతున్నాయి. 2024 జనవరితో పోలిస్తే.. 2025 జనవరి నెలలో దేశ, విదేశీ ప్రయాణికుల రాకపోకలతో పాటు విమాన సర్వీసుల్లోనూ గణనీయంగా వృద్ధి సాధించింది. గత నాలుగు నెలల్లో ఎయిర్‌పోర్టు నుంచి 10.18 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించడం విశేషం.

జనవరిలో అదరగొట్టింది..

జనవరి నెలలో విశాఖ ఎయిర్‌పోర్టు పనితీరుతో అదరగొట్టింది. ప్రయాణికుల రాకపోకలు, విమాన సర్వీసుల్లో మంచి ఫలితాలు రాబట్టుకుంది. స్వదేశీ ప్రయాణికుల రాకపోకల్లో 2024 జనవరితో పోలిస్తే ఈ సారి 32 శాతం వృద్ధి సాధించింది. అదేవిధంగా.. దేశీయ విమాన సర్వీసుల్లోనూ 32 శాతం వృద్ధి నమోదు చేసింది. అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకల్లో ఏకంగా 99 శాతం వృద్ధి నమోదవ్వగా.. అంతర్జాతీయ విమాన సర్వీసుల్లోనూ 110 శాతం నమోదైంది. అదనంగా సర్వీసులు పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. గత నాలుగు నెలల కాలంలో ఎయిర్‌పోర్టు ప్రయాణికుల రాకపోకల వృద్ధి అద్భుతంగా ఉంది. స్వదేశీ ప్రయాణికుల విషయంలో 2023 అక్టోబర్‌తో పోలిస్తే 2024 అక్టోబర్‌లో 9 శాతం వృద్ధి సాధించగా.. నవంబర్‌లో 17 శాతం, డిసెంబర్‌లో 23, ఈ ఏడాది జనవరిలో 32 శాతం నమోదైంది. అదేవిధంగా.. అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకలను పరిశీలిస్తే.. 2023 అక్టోబర్‌తో పోలిస్తే 2024 అక్టోబర్‌లో 85 శాతం, నవంబర్‌లో 83, డిసెంబర్‌లో 115, ఈ ఏడాది జనవరిలో 99 శాతం వృద్ధి నమోదైందని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి తెలిపారు. వింటర్ షెడ్యూల్ ప్రకారం సుమారు 70 విమాన సర్వీసులు విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి రాకపోకలు సాగిస్తుండటంతో అన్ని విభాగాల్లో అద్భుత ఫలితాలు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సమ్మర్ షెడ్యూల్ టైమ్‌కు మరిన్ని సర్వీసులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్టుకు వచ్చే ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు.



గత నాలుగు నెలల కాలంలో ప్రయాణికులు, విమాన సర్వీసుల రాకపోకలు ఇలా...

దేశీయ ప్రయాణికుల రాకపోకలు
2023 అక్టోబర్‌లో- 2,32,004
2024 అక్టోబర్‌లో- 2,52,499 (9 శాతం వృద్ధి)
2023 నవంబర్‌లో- 2,06,213
2024 నవంబర్‌లో- 2,40,494 (17 శాతం వృద్ధి)
2023 డిసెంబర్‌లో - 2,13,711
2024 డిసెంబర్‌లో - 2,63,705 (23 శాతం వృద్ధి)
2024 జనవరిలో- 1,98,353
2025 జనవరిలో- 2,61,636 (32 శాతం)

దేశీయ విమాన సర్వీసుల రాకపోకలు
2023 అక్టోబర్‌లో- 1,732
2024 అక్టోబర్‌లో- 1,855(7 శాతం వృద్ధి)
2023 నవంబర్‌లో- 1,505
2024 నవంబర్‌లో- 1,775(18 శాతం వృద్ధి)
2023 డిసెంబర్‌లో - 1,546
2024 డిసెంబర్‌లో - 1,874(21 శాతం వృద్ధి)
2024 జనవరిలో- 1,462
2025 జనవరిలో- 1,932(32 శాతం)

అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకలు
2023 అక్టోబర్‌లో- 5,175
2024 అక్టోబర్‌లో- 9,576 (85 శాతం వృద్ధి)
2023 నవంబర్‌లో- 5,165
2024 నవంబర్‌లో- 9,475 (83 శాతం వృద్ధి)
2023 డిసెంబర్‌లో - 5,600
2024 డిసెంబర్‌లో - 12,042 (115 శాతం వృద్ధి)
2024 జనవరిలో- 5,583
2025 జనవరిలో- 11,107(99 శాతం)

అంతర్జాతీయ విమాన సర్వీసుల రాకపోకలు
2023 అక్టోబర్‌లో- 35
2024 అక్టోబర్‌లో- 77 (120 శాతం వృద్ధి)
2023 నవంబర్‌లో- 35
2024 నవంబర్‌లో- 77 (120 శాతం వృద్ధి)
2023 డిసెంబర్‌లో - 38
2024 డిసెంబర్‌లో - 82 (116 శాతం వృద్ధి)
2024 జనవరిలో- 41
2025 జనవరిలో- 86 (110 శాతం)



కలెక్టరేట్ ఎదురుగా ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఈ మధ్యాహ్న భోజనం మాకొద్దు!

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసిన వాడపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

కుళ్లిన పల్లీలు, పురుగు పట్టిన పదార్థాలతో వంట చేస్తున్నారంటూ ఆవేదన



నీళ్లలా కనిపిస్తున్న గోంగూర పప్పు, ముద్దలా మారిన అన్నం



భోజనం తినలేక చెత్తబుట్టలో పడేసిన విద్యార్థులు

సాక్షి, విశాఖపట్నం: 'కలెక్టర్ సార్.. మా స్కూల్లో పెడుతున్న మధ్యాహ్న భోజనం తినలేకపోతున్నాం. ముద్దగా అయిపోయిన అన్నం.. నీళ్ల చారు.. పురుగులతో ఉన్న కూరలు పెడుతున్నారు. తింటుంటే వాంతులు వస్తున్నాయి. దీంతో బయట పారబోసేస్తున్నాం. సాయంత్రం వరకూ స్కూల్‌లో ఆకలితో అలమటిస్తూ చదువు మీద శ్రద్ధ చూపించలేకపోతున్నాం. దీని గురించి అడుగుతుంటే భయపెడుతున్నారు. తిడుతున్నారు. దయచేసి.. ఈ మధ్యాహ్న భోజనం మా స్కూల్‌లో వద్దు సార్' అంటూ విశాఖపట్నం జిల్లా వాడపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రోడ్డెక్కారు. స్కూల్‌లో పెడుతున్న మధ్యాహ్న భోజనం సరిగా లేదని ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోవడంతో.. విద్యార్థులు తమ తల్లిదండ్రుల సాయంతో కలెక్టరేట్ ఆవరణలో ధర్నాకు దిగారు. భోజనం తినలేకపోతున్నాం.. న్యాయం చెయ్యండి కలెక్టర్ గారూ.. అంటూ నినాదాలు చేశారు. విద్యార్థులు చెప్పిన వివరాలిలా ఉన్నాయి.

చినగదిలి మండలం వాడపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో గత కొద్ది నెలలుగా మధ్యాహ్న భోజన పథకం అస్తవ్యస్తంగా మారింది. ఒక్కోసారి ఉడికీ ఉడకని అన్నం పెడుతున్నారు. ఇంకోసారి జావలా మారిన అన్నం వడ్డిస్తున్నారు. దీనికి తోడు.. కూరలు, మెనూలోని ఇతర పదార్థాలు కూడా రుచీపచీ లేకుండా దారుణంగా ఉంటున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుళ్లిపోయిన కూరగాయలతో కూరలు వండినప్పుడు పురుగులు తేలుతున్నాయి.. పులిహోర, బిర్యానీ చేసినప్పుడు పాడైపోయిన వేరుశనగ పలుకులు, ముక్కిపోయి పురుగులున్న సోయాచంక్స్(మీల్‌మేకర్) వాడుతున్నారు.. అవి తింటుంటే వాంతులు వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. పప్పు, ఆకుకూరల్లో నీళ్ల తప్ప ఏమీ కనిపించవనీ.. ప్రతి భోజనంలో తలవెంట్రుకలు ఉంటున్నాయని ఆవేదన చెందుతూ మాట్లాడారు. ఈ భోజనం తినలేక.. కష్టంగా ఉన్నా.. పారబోసేస్తున్నామని చెప్తున్నారు. భోజనం సరిగా లేదని చెప్పినా స్కూల్‌లో పట్టించుకోవట్లేదని, వంటచేసేవాళ్లకు చెప్తే బెదిరిస్తున్నారని, దీంతో ఆకలితో చదువుమీద శ్రద్ధ చూపలేకపోతున్నామంటూ కన్నీటి పర్యంతమయ్యారు. తమ ఆకలి బాధని చెప్పుకోవడానికి తల్లిదండ్రుల సాయం తీసుకుని కలెక్టరేట్‌కు వచ్చి ధర్నా చేస్తున్నామని విద్యార్థులు తెలిపారు.

విద్యార్థులు ధర్నా చేస్తున్న సమయంలో డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు కలెక్టరేట్‌కు వచ్చి.. విద్యార్థులతో మాట్లాడారు. సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో హైస్కూల్‌కు వెళ్లి భోజన సదుపాయాల్ని పరిశీలించి.. విద్యార్థుల దగ్గర నుంచి వివరాలు సేకరించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి విద్యార్థికి సంపూర్ణ పోషకాలు అందించేలా మధ్యాహ్న భోజన పథకంలో చర్యలు తీసుకున్నారని, ఇప్పుడు మాత్రం ఆ పరిస్థితుల్లేవని విద్యార్థుల తల్లిదండ్రులు ఆక్షేపిస్తున్నారు.

మంచి భోజనం పెట్టించండి సార్



స్కూల్‌లో భోజనం తినలేకపోతున్నాం. మధ్యాహ్నం లంచ్ బెల్ మోగిందంటే మాకు భయంగా ఉంటుంది. ఈ రోజు ఫుడ్ ఎలా ఉంటుందోనని అందరం అనుకుంటాం. అన్నం ముద్దలా పెడుతున్నారు. కూరలు సరిగా ఉండవు. తలవెంట్రుకలు కనిపిస్తుంటాయి. పురుగులుంటాయి. అడుగుతుంటే కోప్పడుతున్నారు. తినలేక అందరం పడేస్తున్నాం. బాగున్నప్పుడు కొంచెం కొంచెం పెడుతుంటారు. చాలా మందికి ఫుడ్ కూడా సరిపోదు. మాకు మంచి భోజనం పెట్టమనండి సార్. ప్లీజ్.

– ఉదయ్‌కుమార్, 6వ తరగతి

పిల్లల బాధ చూడలేకే వచ్చాం



ఒకప్పుడు భోజనం బాగుండేది. ఇప్పుడు పిల్లలు స్కూల్‌లో తినడమే మానేశారు. సాయంత్రం ఇంటికి ఆకలితో వస్తున్నారు. ఇంటి దగ్గర నుంచి బాక్స్ తీసుకెళ్లండని అంటే.. ఈ రోజైనా బాగుంటుందేమోనని అందరూ ఆశపడుతున్నారు. కానీ.. రోజూ భోజనం అలాగే ఉంటోందని చెప్తున్నారు. పిల్లలు చదువుకోలేకపోతున్నారు. దయచేసి మా పిల్లలకు మంచి భోజనం పెట్టించేలా చూడండి.

– వి.లక్ష్మి, విద్యార్థి తల్లి

ఎన్ని రోజులు పస్తులుంచుతారు.?



ప్రతి రోజూ మధ్యాహ్న భోజనం తినడం మానేశాం. సాయంత్రం వరకూ ఆకలితో ఉంటూ క్లాసులు వింటున్నాం. చదువు ఏమీ తలకెక్కడం లేదు. ఇంటికి ఎప్పుడు వెళ్లి తిందామా అనే ఆలోచనలోనే అందరం ఉంటున్నాం. ఎన్ని రోజులు ఇలా పస్తులుంచుతారో అర్థం కావడం లేదు. మా సమస్య పరిష్కరించి.. మంచి భోజనం అందించండి చాలు. మేం చదువుకుంటాం.

– వి.మంజిత్, 9వ తరగతి విద్యార్థి

వైఎస్సార్‌సీపీలో యువతకు ప్రాధాన్యం



వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుల సమావేశంలో పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్. చిత్రంలో సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్‌కుమార్, కేకే రాజు, తిప్పల దేవన్‌రెడ్డి

- పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలి
- సమన్వయకర్తలు, అనుబంధ విభాగ అధ్యక్షుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: యువత రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలని, వారిని ప్రోత్సహించడంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎప్పుడూ ముందుంటారని పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. సీనియర్లు, యువకులు పార్టీ బలోపేతమే లక్ష్యంగా శ్రమించాలని పిలుపునిచ్చారు. సోమవారం మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో అమర్‌నాథ్ అధ్యక్షతన సమన్వయకర్తలు, అనుబంధ విభాగ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీలో జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులుగా ఎక్కువ మందిని యువకులనే నియమించామన్నారు. యువతను వెన్నుతట్టి ప్రోత్సహించే పార్టీ వైఎస్సార్‌సీపీ ఒక్కటేనన్నారు. జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన వారంతా పార్టీని ముందుండి నడిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, సమన్వయకర్తలు కేకే రాజు, తిప్పల దేవన్‌రెడ్డి, పార్టీ కార్యాలయం పర్యవేక్షకుడు రవిరెడ్డి, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు దొడ్డి కిరణ్, పేడాడ రమణి కుమారి, సనపల రవీంద్ర భరత్, బోని శివ రామకృష్ణ, బర్కత్ అలీ, అద్దేపల్లి రవిబాబు, పులగం కొండారెడ్డి, సేనాపతి అప్పారావు, పీలా ప్రేమ కిరణ్ జగదీష్, ఎస్.ప్రసాద్ రావు, చిక్కాల సత్యనారాయణ, రాయపు అనిల్ కుమార్, మేడిది ఆనందరావు, బాజీ నాయుడు, బోండా ఉమా మహేశ్వరరావు, వాసుపల్లి యల్లాజి, గున్నంటి పూర్ణానంద శర్మ, పార్టీ ముఖ్యనేతలు మొల్లి అప్పారావు, వంకాయల మారుతి ప్రసాద్, దేవరకొండ మార్కండేయులు, కార్పొరేటర్ పీవీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్.. డోంట్ కేర్!

- 13న ఏపీఎంఎస్ఈఎఫ్‌సీ రీజినల్ సమావేశం
- ఎన్నికల కోడ్ ఉన్నా హడావుడిగా నిర్వహణకు ఏర్పాట్లు
- జిల్లా పరిశ్రమల కేంద్రానికి రావాలంటూ ఎంఎస్ఎంఈ యాజమాన్యాలకు పిలుపు
- కీలక ఆర్థిక పరమైన వ్యవహారాలు చక్కబెట్టేందుకు సన్నాహాలు

సాక్షి, విశాఖపట్నం : ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అడ్డు వస్తోంది.. కానీ పరిశ్రమల ఆర్థిక సమస్యలు పరిష్కరించేందుకు మాత్రం ఎటువంటి అడ్డంకి కాదంట. ఎందుకంటే ప్రజా సమస్యలు పరిష్కరిస్తే పైసా రాదు.. అదే ఎంఎస్ఎంఈ సమస్యలు పరిష్కరిస్తే కాసులు రాలుతాయి. అందుకే కోడ్ పక్కనపెట్టి కీలకమైన కౌన్సిల్ సమావేశానికి జిల్లా పరిశ్రమల శాఖ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టర్ కూడా ఇందుకు అడ్డుచెప్పకపోవడం అనేక విమర్శలకు తావిస్తోంది.

ఎంఎస్ఎంఈ సమస్యల పరిష్కారానికి కౌన్సిల్

ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంట్ పరిధిలో ఉండే సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)కు సంబంధించి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు చేశారు. ఎంఎస్ఎంఈ సెక్టార్‌లో ఉత్పత్తుల తయారీకి సంబంధించి మెటీరియల్ సప్లయ్ చేసినా డబ్బులు చెల్లించకపోవడం.. ఉత్పత్తులు డెలివరీ చేసినా నిర్ణీత సమయంలో చెల్లింపులు జరపకపోయినా ఫిర్యాదులు చేసేందుకు ఏపీ స్టేట్ మైక్రో స్మాల్ ఎంటర్ ప్రైజెస్ ఫెసిలిటేషన్ కౌన్సిల్ (ఏపీఎంఎస్ఈఎఫ్‌సీ) పనిచేస్తుంది. ఈ ఫెసిలిటేట్ కౌన్సిల్‌లో ఫిర్యాదు చేస్తే సదరు కంపెనీకి సంబంధించిన అంశాలపై విచారణ చేపట్టి బిల్లులు చెల్లించేలా తీర్పులు ఇస్తుంటారు. గతంలో మంగళగిరిలోని డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా కలిపి ఈ కౌన్సిల్‌ను నిర్వహించేవారు. ఇప్పుడు రీజినల్ లెవల్‌లో నిర్వహిస్తున్నారు. ఉత్తరాంధ్రతో పాటు ఉభయగోదావరి జిల్లాలకు సంబంధించి విశాఖపట్నంలోని జిల్లా పరిశ్రమల కేంద్రంలో కౌన్సిల్ సమావేశం జరుగుతుంటుంది.

కోడ్ ఉల్లంఘించి మరీ..

తాజాగా కోస్తా రీజియన్ కౌన్సిల్ నిర్వహించేందుకు హడావుడిగా ఏర్పాట్లు చేశారు. వారం రోజుల క్రితం జీఎం ఆధ్వర్యంలో ఫిర్యాదులు చేసిన పరిశ్రమలకు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 13న ఉదయం 11 గంటల నుంచి ఏపీఎంఎస్ఈఎఫ్‌సీ కౌన్సిల్ నిర్వహించనున్నామని, ప్రతి ఒక్కరూ విధిగా హాజరు కావాలంటూ ఆదేశాలు జారీ చేశారు. అయితే ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో కౌన్సిల్ ఏర్పాటు చెయ్యడంపై పారిశ్రామిక వేత్తలు కలవరపడుతున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించామని తమ మీద కూడా కేసులు నమోదు చేస్తారేమోనని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై పరిశ్రమల శాఖ అధికారులను కొందరు ఎంఎస్ఎంఈ ప్రతినిధులు సంప్రదిస్తే అవన్నీ తాము చూసుకుంటాం.. మీరు ఎలా ప్రిపేర్ అవ్వాలో తెలుసు కదా అన్నట్లుగా సమాధానమివ్వడంతో విస్తుపోయారు.



ఏపీఎంఎస్ఈఎఫ్‌సీ రీజినల్ సమావేశం నిర్వహించనున్న జిల్లా పరిశ్రమల కేంద్రం

లోపాయికారి ఒప్పందాలతో..

సమావేశంలో ఎంఎస్ఎంఈల బిల్లుల సెటిల్‌మెంట్లకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఇప్పటికే ఈ బిల్లుల ఫిర్యాదులకు సంబంధించి పరిశ్రమల శాఖ అధికారులు లోపాయికారీ ఒప్పందాలు చేసుకున్నట్లు సమాచారం. అందుకే కోడ్ ఉన్నా పట్టించుకోకుండా ఎలాగైనా కౌన్సిల్ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టర్ కూడా కౌన్సిల్ రద్దు చేయాలని ఆదేశించకపోవడం గమనార్హం. ప్రతి సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించే గ్రీవెన్స్‌తో పాటు జిల్లా పరిశ్రమల శాఖ పరిధిలో ప్రతి నెలా నిర్వహించే ఆర్థిక పరమైన నిర్ణయాల సమీక్ష సమావేశాన్ని కూడా రద్దు చేసేశారు. కానీ ఏపీఎంఎస్ఈఎఫ్‌సీ రీజినల్ సమావేశం మాత్రం రద్దు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

వందేభారత్‌లో సిగరెట్ పొగ



టీసీని నిలదీస్తున్న ప్రయాణికులు

సాక్షి, విశాఖపట్నం: వందేభారత్ రైలులో సిగరెట్ పొగ కలకలం సృష్టించింది. విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు సోమవారం ఉదయం బయల్దేరిన వందేభారత్ రైలు బాత్‌రూమ్‌లో ఓ ప్రయాణికుడు సిగరెట్ తాగాడు. బోగీ మొత్తం పొగ, సిగరెట్ వాసన రావడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. అక్కడికి వచ్చిన టీసీని నిలదీశారు. ట్రైన్‌లోని సీసీటీవీ ఫుటేజీ పరిశీలించి.. సిగరెట్ తాగిన ప్రయాణికుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై సదరు టీసీ తనకేం సంబంధం లేదని, తానేం చెయ్యలేనంటూ ప్రయాణికులతో వాదనకు దిగారు. సిగరెట్ కారణంగా ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే బాధ్యులెవరంటూ ప్రయాణికులు ప్రశ్నించారు. దీంతో టీసీ అక్కడి నుంచి విసురుగా వెళ్లిపోయారు. ఈ వ్యవహారం మొత్తం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. దీనిపై స్పందించిన రైల్వే అధికారులు.. సిగరెట్ తాగిన ప్రయాణికుడ్ని గుర్తించి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, బచేలి-కిరండూల్ స్టేషన్‌ల పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం కేకే లైన్‌లో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో దంతేవాడ వరకే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్(58501) పాసింజర్ ఈ నెల 13 నుంచి మార్చి 6వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం(58502) పాసింజర్ మార్చి 7వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయి. విశాఖపట్నం-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13 నుంచి మార్చి 6వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం(18513) ఎక్స్‌ప్రెస్ మార్చి 7వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయి.

ముగిసిన నామినేషన్ల పర్వం

మొత్తం 10 నామినేషన్లు దాఖలు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ల ప్రక్రియ సోమవారంతో ముగిసింది. ఆఖరి రోజు రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులు పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌కు సంబంధిత పత్రాలను అందజేశారు. అభ్యర్థుల చేత రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్ వెలువడగా, సోమవారం వరకు నామినేషన్లు స్వీకరించారు. నామినేషన్ల పర్వం ముగిసే సరికి 10 నామినేషన్లు దాఖలైనట్టు కలెక్టర్ వెల్లడించారు. మంగళవారం నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణ ఉంటుంది. ఆ తరువాత పోటీలో ఎంతమంది ఉన్నారో స్పష్టమవుతుంది. అనంతరం ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు గుర్తుల కేటాయింపు, ఇతర ప్రక్రియలు కొనసాగుతాయని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో భవానీ శంకర్, నోడల్ అధికారి దయానిధి పాల్గొన్నారు.

నామినేషన్లు వేసిన అభ్యర్థులు

కోసూరు రాధాకృష్ణ, పాకలపాటి రఘువర్మ, సత్తలూరి శ్రీరంగ పద్మావతి, కోరెడ్ల విజయ గౌరి, నూకల సూర్యప్రకాశ్, రాయల సత్యనారాయణ, గాదె శ్రీనివాసులు నాయుడు, పోతల దుర్గారావు, పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు నామినేషన్లు దాఖలు చేశారు.

పారా న్యాయ సహాయకులు సేవలందించాలి

విశాఖ–లీగల్ : బడుగు,బలహీన వర్గాలకు న్యాయ సహాయం అందించేందుకు పారా న్యాయ సహాయకులు సహకారం అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. సోమవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కొత్తగా ఎంపికైన పారా న్యాయ సహాయకుల శిక్షణా కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రాథమిక హక్కులు, విధులు, ఎఫ్ఐఆర్, ఫిర్యాదు ఎలా చేయాలి, న్యాయ సహాయం పొందేందుకు అర్హతలు, కొత్త నేర న్యాయ చట్టాలను వివరించారు. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ భారతీయ పీనల్ కోడ్, భారతీయ సాక్షి చట్టం, నూతన నేర న్యాయ చట్టాలను వివరించారు. సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.వెంకటరమణ నిందితులు, బాధితుల హక్కులు, అరెస్టులు, బెయిల్ తదితర అంశాలపై మాట్లాడారు. లోక్ అదాలత్‌లలో కేసులు రాజీ చేసుకుంటే శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ, ఇతర న్యాయమూర్తులు, మేజిస్ట్రేట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, చిత్రంలో సీపీ బాగ్చి

క్లుప్తంగా

వాసుపల్లిని కలిసిన వాణిజ్య విభాగం అధ్యక్షుడు ప్రసాదరావు



వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్‌ను పార్టీ విశాఖ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు సకలాభక్తుల ప్రసాదరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాలలు, శాలువతో సత్కరించారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పార్టీ పటిష్టతకు కృషిచేస్తానని పేర్కొన్నారు. - అల్లిపురం

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితులను జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.80వేలు విలువగల 16 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం విశాఖ రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి, ఎస్ఐ ఒభిషేక్ మిస్త్రీ .. సిబ్బందితో కలిసి ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాకు చెందిన మిట్టు ఖేమిండు, బసంత ఖేముండు, నీలకంఠ బండా, ఉత్తరప్రదేశ్ వారణాసికి చెందిన రజనీష్ కుమార్ సింగ్‌లు అక్రమంగా గంజాయి రవాణా చేయడాన్ని గుర్తించారు. గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించారు.

మరో కేసులో 7కేజీల గంజాయి సీజ్...

మరో కేసులో ఉత్తరాఖండ్‌కు చెందిన మోహన్ సింగ్ నుంచి రూ.35వేలు విలువైన 7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలలో జీఆర్పీ ఎస్ఐ శాంతారం, సీఐబీ/ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎస్‌కే బారిక్‌లు తమ తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. నిందితుడ్ని రిమాండ్‌కు తరలించామన్నారు.

ఇసుక వ్యాపారుల బరితెగింపు

- **అనుమతికి మించి ఇసుక అక్రమ రవాణా**
- **ఓవర్‌లోడ్‌పై గాజువాక తహసీల్దార్ కన్నెర్ర**
- 12 ఇసుక లారీల సీజ్
- మంత్రి అచ్చెన్న తమకు అనుమతి ఇచ్చారంటూ తహసీల్దార్‌ను బెదిరించే యత్నం



గాజువాక తహసీల్దార్ సీజ్ చేసిన ఇసుక లారీలు

సాక్షి, విశాఖపట్నం : గాజువాకలో ఇసుక వ్యాపారులు బరితెగిస్తున్నారు. అనుమతికి మించి అక్రమంగా ఇసుక తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యాపారులు.. ఆ వ్యవహారాన్ని అరికట్టడానికి ప్రయత్నిస్తున్న అధికారులపై ఎదురు తిరుగుతున్నారు. ఓవర్‌లోడ్‌ను అనుమతించేది లేదంటూ లారీలను అడ్డుకొంటున్న గాజువాక తహసీల్దార్‌ను మంత్రి అచ్చెన్నాయుడు పేరు చెప్పి బెదిరించేందుకు ప్రయత్నిస్తున్నారు. తమకు అచ్చెన్నాయుడు అనుమతి ఇచ్చారని.. ఇసుక విషయం మీకు సంబంధం లేదంటూ ఇసుక వ్యాపారులు తహసీల్దార్‌తో వాదనకు దిగడం చర్చనీయాంశమైంది. ఇసుక సరఫరాకు సంబంధించి ప్రభుత్వం గాజువాకలో ఇసుక డిపోను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఇసుక వ్యాపారులు రీచ్‌ల నుంచి ఇసుకను తీసుకురావడంలో అక్రమాలకు పాల్పడుతున్నట్టు గుర్తించిన గాజువాక తహసీల్దార్ టి.శ్రీవల్లి గత వారం రోజులుగా వారిపై ఉక్కు పాదం మోపుతున్నారు. అందులో భాగంగా ఇప్పటివరకు 12 లారీలను సీజ్ చేశారు.

అనుమతికి మించి తరలింపు

47 టన్నుల ఇసుకకు అనుమతి తీసుకొని 74 టన్నుల ఇసుకను తరలించేస్తున్నారు. రూ.96 వేలు చెల్లించాల్సిన బిల్లు స్థానంలో కేవలం రూ.61 చెల్లించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. **దీనిపై సమాచారం అందుకున్న తహసీల్దార్ ఇసుక అక్రమ రవాణా, ఓవర్‌లోడ్‌పై ఉక్కుపాదం మోపారు. ఈ క్రమంలో తహసీల్దార్‌పై ఇసుక** వ్యాపారులు తిరగబడటంతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేల పేర్లు చెప్పి బెదిరింపులకు పాల్పడుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు. ఎన్నికల్లో లారీ ఓనర్లు, ఇసుక వ్యాపారులు ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా కూటమి విజయం కోసం పని చేశారని.. ఇప్పుడు అధికారులు ఇలా దాడి చేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చి వచ్చే ఎన్నికల్లో ఇబ్బంది పడతామంటూ వీడియోలు తయారు చేసి సోషల్ మీడియాలో వదులుతున్నారు. దీనిపై పవన్ కల్యాణ్ కూడా కలగజేసుకోవాలని ఇసుక వ్యాపారులు ఆ వీడియోలో వాపోవడం మరో విశేషం.

వే బిల్లుల్లో తేడాలు

ఈ విషయంపై గాజువాక తహసీల్దార్ టి.శ్రీవల్లిని సంప్రదించగా ఇసుక అక్రమ రవాణాను అనుమతించేది లేదని చెప్పారు. ఓవర్‌లోడ్‌తో వచ్చిన లారీ వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే వచ్చే నష్టం కన్నా ముందుగానే అరికట్టడం మేలన్నారు. వే బిల్లుల్లో కూడా తేడాలున్నాయని, వ్యాపారులు చూపించే బిల్లుల్లో పొంతన కుదరడంలేదని పేర్కొన్నారు. అందువల్లే లారీలను సీజ్ చేస్తున్నామన్నారు.

లారీ ఢీకొని యువతి దుర్మరణం

యువకుడికి తీవ్ర గాయాలు



కొణతాల ఉషారాణి (ఫైల్)



సంఘటనా స్థలంలో కొణతాల ఉషారాణి మృతదేహం

అక్కిరెడ్డిపాలెం : ఆటోనగర్‌లో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం చెందగా..యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలు...శ్రీకాకుళానికి చెందిన మళ్ల సిద్ధు, ఇచ్ఛాపురానికి చెందిన కొణతాల ఉషారాణి (22) లంకెలపాలెంలో ఫైజర్ ఫార్మా కంపెనీలో ఇంటర్న్ షిప్ పొందుతున్నారు. వీరిద్దరూ కూర్మన్నపాలెంలో నివాసముంటున్నారు. శుక్రవారం వీరిద్దరూ స్వస్థలాలకు వెళ్లే క్రమంలో ద్విచక్రవాహనాన్ని విశాఖ రైల్వే స్టేషన్‌లో పార్క్ చేశారు. ఇదిలావుండగా కొరియర్ వచ్చిందంటూ ఫోన్ రావడంతో సోమవారం స్వస్థలాల నుంచి వీరిద్దరూ విశాఖ చేరుకుని, ద్విచక్రవాహనంపై ఆటో నగర్ వెళ్లి పార్సిల్ రిసీవ్ చేసుకున్నారు. ఆటోనగర్ నుంచి కూర్మన్నపాలెం వస్తుండగా వెనుక నుంచి లారీ బలంగా వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో వెనుక కూర్చున్న ఉషారాణి రోడ్డుపై పడిపోయింది. ఆమె పై నుంచి లారీ వెళ్లిపోవడంతో శరీరం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందింది. వాహనం నడుపుతున్న సిద్ధు కాలికి గాయమైంది. క్షతగాత్రుడ్ని సమీపంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. యువతి మృతిపై ఆమె కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ కోటేశ్వరరావు తెలిపారు.

పూర్ణామార్కెట్‌లో ఆక్రమణల తొలగింపు

- విశాలంగా కనిపిస్తున్న రహదారులు, ఫుట్‌పాత్‌లు
- వినియోగదారులు, వాహనచోదకులకు ఊరట



పూర్ణామార్కెట్‌లో దుకాణాలు తొలగిస్తున్న వన్‌టౌన్‌పోలీసులు



షాపులు తొలగించడంతో విశాలంగా పూర్ణామార్కెట్ ప్రధాన రహదారి

జగదాంబ : నగరానికి కీలకమైనది పూర్ణామార్కెట్. దీనినే సర్దార్ వల్లభాయ్ పటేల్ మార్కెట్ అని అంటారు. హోల్‌సేల్‌తోపాటు ప్రజలకు చౌకగా సరుకులు లభించే మార్కెట్. జీవీఎంసీ లెక్కల ప్రకారం సుమారు 430 శాశ్వత, 200 తాత్కాలిక దుకాణాలు, లోపల, బయట మరో 100 మంది చిరు వ్యాపారులు కలిపి సుమారు 650 మందికిపైగానే ఉన్నారు. 1.35 ఎకరాల విస్తీర్ణంలో ఈ మార్కెట్ ఉంది. ఇంత ప్రసిద్ధి చెందిన మార్కెట్ ఆక్రమణలకు గురవుతోంది. తాజాగా జీవీఎంసీ అధికారులు, పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం ఆక్రమణలను తొలగించారు. రహదారులు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారి దుకాణాలను వన్‌టౌన్ లా అండ్ ఆర్డర్ సీఐ జీడీ బాబు, ట్రాఫిక్ సీఐ షన్ముఖరావు, పోలీసు, జీవీఎంసీ సిబ్బంది ఆధ్వర్యంలో తొలగించారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు రావడంతో మూడు రోజుల క్రితం జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, పోలీసులు పూర్ణామార్కెట్‌లో పర్యటించారు. ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తమ దుకాణాలను తొలగించాలని హెచ్చరించారు. అయినప్పటికీ తొలగించకపోవడంతో సోమవారం పోలీసుల సాయంతో వాటిని తొలగించారు. షాపులు తొలగించిన నేపథ్యంలో చిరు వ్యాపారులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జీవీఎంసీ జోన్-4 అసిస్టెంట్ టౌన్ ప్లానింగ్ అధికారి ఝాన్సీ మాట్లాడుతూ పూర్ణామార్కెట్‌లో రహదారులు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ జీడీ బాబు మాట్లాడుతూ ప్రజలకు, పాదచారులకు ఇబ్బందులు కల్గిస్తున్నారే ఫిర్యాదులు చాలా వచ్చాయని, వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేయకపోతే దుర్భాషలాడుతున్నట్టు ఫిర్యాదులు అందాయన్నారు. అంతేకాకుండా ఆక్రమణదారుల వల్ల శానిటేషన్ సిబ్బంది శుభ్రం చేసేందుకు అవకాశం లేకుండా పోతోందన్నారు. దీంతో పూర్ణామార్కెట్‌లో దుర్వాసన వెదజల్లుతోందన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ డ్రైవ్ చేపట్టామన్నారు. పూర్ణామార్కెట్ పరిసరాల్లో మార్కింగ్ చేస్తామని, ఆ మార్కింగ్ లోపలే ఎవరైనా వ్యాపారాలు చేసుకోవాలని, గీత దాటితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అటువంటి షాపులను తొలగించి, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

స్టీల్‌ప్లాంట్‌లో ప్రమాదం: కార్మికుడికి గాయాలు



గాయపడిన శ్రీనివాసరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్ ఓవెన్స్ విభాగంలో సోమవారం జరిగిన ప్రమాదంలో కాంట్రాక్ట్ కార్మికునిగా గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక పంతులగారి మేడ సమీపంలో ఉంటున్న నాగ శ్రీనివాసరావు(53) స్టీల్‌ప్లాంట్ కోక్ ఓవెన్స్ విభాగం బ్యాటరీ-2లో అన్‌స్కిల్డ్ కార్మికునిగా పనిచేస్తున్నాడు. సోమవారం విధి నిర్వహణలో భాగంగా కోక్ సైడ్ ఎయిర్ పైపుతో క్లీనింగ్ పనులు చేశాడు. పనులు ముగించుకొని వస్తుండగా లిడ్‌పై కాలు పడింది. దీంతో లిడ్ ఓవెన్ నుంచి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో అతని శరీరంపై గాయాలయ్యాయి. వెంటనే అతడిని ఉక్కు జనరల్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం నగరంలోని ఆస్పత్రికి తరలించారు.

ఆన్‌లైన్ రుణాల పేరిట ఘరానా మోసం

- 26 అకౌంట్ల ద్వారా రూ.12 లక్షలు వసూలు
- నిందితుడి అరెస్టు

అల్లిపురం : ఆన్‌లైన్ రుణాల ద్వారా మోసాలకు పాల్పడడమే కాకుండా బాధితుల ఫొటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్ చేయడంతోపాటు ఓ వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన నిందితుడ్ని విశాఖ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి గత ఏడాది ఆన్‌లైన్ ద్వారా రూ.2వేలు రుణం పొందాడు. అందులో సగం డబ్బులు తిరిగి చెల్లించినా మార్ఫింగ్ ఫొటోలతో వేధింపులు కొనసాగాయి. మనస్థాపంతో బాధితుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. కేసును సైబర్ క్రైం పోలీసులకు అప్పగించారు. మృతుని ఫోన్ డేటా ఆధారంగా నిందితుడు కర్నూలు జిల్లాకు చెందిన వాడిగా గుర్తించారు. నిందితుడు 26 అకౌంట్ల ద్వారా చాలా మంది నుంచి రూ.12 లక్షల మేర వసూలు చేసినట్టు గుర్తించారు. వాటిని విచారణ చేయగా అసోం, బిహార్, గుజరాత్, హర్యానా, మధ్యప్రదేశ్, పంజాబ్, రాజస్తాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, న్యూఢిల్లీ, వెస్ట్ బెంగాల్ ప్రాంతాలకు చెందిన అకౌంట్లుగా గుర్తించారు. ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్న ప్రధాన ముద్దాయిల కోసం దర్యాప్తు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు.

మహా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికులు, భక్తులు సౌకర్యార్థం పలు ప్రత్యేక రైళ్లు మహాకుంభ మేళా కోసం నడుపుతున్నామని డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ తెలిపారు. ఈ నెల 16, 22వ తేదీల్లో విశాఖ-గోరఖ్‌పూర్ స్పెషల్, తిరుగు ప్రయాణంలో ఈ నెల 19, 24వ తేదీలలో గోరఖ్‌పూర్-విశాఖ స్పెషల్, ఈ నెల 20, 27వ తేదీల్లో విశాఖ-దీన్‌దయాళ్ ఉపాధ్యాయ స్పెషల్ తిరుగు ప్రయాణంలో ఈ నెల 22, మార్చి 1వ తేదీల్లో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ- విశాఖ స్పెషల్, ఈ నెల 15,22వ తేదీల్లో తిరుపతి -బనారస్ స్పెషల్ (వయా దువ్వాడ), తిరుగు ప్రయాణంలో ఈ నెల 17,24వ తేదీల్లో బనారస్-తిరుపతి స్పెషల్ (వయా దువ్వాడ) మీదుగా నడవనున్నాయన్నారు.

ఆ వార్తల్లో నిజం లేదు

ప్రయోగ్‌రాజ్ స్టేషన్ మూసివేస్తున్నట్టు మీడియాలో వస్తున్న కథనాలను నమ్మవద్దని డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ విజ్ఞప్తి చేశారు. యుద్ధప్రాతిపదికన రైల్వే అధికారులు పనిచేస్తూ నిత్యం వందలాది రైళ్ల రాకపోకలు సాగించేలా చర్యలు చేపడుతున్నారన్నారు. నార్త్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్, ప్రయాగ్‌రాజ్, వారణాసి, లక్నో డీఆర్ఎంలతో కలిసి ప్రయాగ్‌రాజ్‌లోనే ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

సీతమ్మధార : రీల్స్ చేస్తున్న మైనర్‌ను ఇన్‌స్టాలో పరిచయం పెంచుకుని బలవంతంగా వివాహం చేసుకున్న భార్గవ్‌పై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. సోమవారం నిందితుడ్ని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఫోర్త్‌టౌన్ పోలీసులు తెలిపారు. భార్గవ్‌పై పోక్సో కేసు, బాల్యవివాహ నిరోధక చట్టం, ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేశారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పతకాల పంట

మధురవాడ: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో మధురవాడకు చెందిన క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచారు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లా కాకినాడ జేఎన్‌టీయూ ఇండోర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన ఎన్‌టీఆర్ మెమోరియల్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర తైక్వాండో పోటీలలో మధురవాడ ఆనంద్ తైక్వాండో క్లబ్ క్రీడాకారులు 6 బంగారు, 4 కాంస్య, 4 రజత పతకాలు కైవసం చేసుకున్నారు.

విజేతలు వీరే: అండర్ 49 కేజీలు విభాగంలో చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన అలజంగి పవిత్ర, అలాగే వివిధ పాఠశాలలో చదువుతున్న కేడెట్ అండర్ 47 కేజీలు విభాగంలో అల్లు భాగ్యశ్రీ, అండర్ 55 కేజీలు విభాగంలో యండమూరి రక్షణ, సీనియర్ మహిళా డివిజన్ అండర్ 53 కేజీలు విభాగంలో పి.భార్గవిలు బంగారు పతకాలు సాధించగా పలు కేటగిరీలో మరో 10 మంది కాస్య, రజత పతకాలు సాధించారు. విజేతలను ఏపీ అమెచ్యూర్ తైకాండో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కోచ్ బి.అనంద్, ఇతర కోచ్‌లు ఏ. పవన్‌కుమార్, బి. హేమంత్, శ్రీనాథ్ అభినందించారు.

భార్యాభర్తలపై రౌడీ షీటర్ల దాడి

అల్లిపురం: నగరంలో రౌడీ షీటర్లు రెచ్చిపోతున్నారు. పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నా వారి పంథా మార్చుకోవడం లేదు. మహారాణిపేట పోలీసు స్టేషన్ పరిధిలో భార్యాభర్తలపై కొందరు రౌడీ షీటర్లు ఆదివారం దాడికి పాల్పడ్డారు. సీఐ బి.భాస్కరరావు తెలిపిన వివరాలు ఇలా.. పందిమెట్టకు చెందిన మండగ వంశీ తన భార్య లతతో కలిసి ఆదివారం రాత్రి సీతమ్మపేట వెళ్లి రాత్రి 10 గంటల సమయంలో ఇంటికి వస్తున్నారు. ఆ సమయంలో అక్కడ గెడ్డవంతెనపై భవానీ శంకర్ అలియాస్ చోటు, వెంకట మణికంఠ, రాజు, గుంటుపోయిన అప్పలరాజులు తన భార్యపట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని, ప్రశ్నించినందుకు తనపై ఇటుకలు, బల్లులతో దాడి చేసి, చంపేస్తామని బెదిరించారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. భయంతో తమ ఇంటికి వెళ్లినా ఆగకుండా తలుపులు విరగ్గొట్టి చంపుతామని బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భాస్కరరావు తెలిపారు.

జూ క్యూరేటర్ కార్ డ్రైవర్ మృతి



మృతుడు రవి(ఫైల్)..

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కు క్యూరేటర్ కార్ డ్రైవర్‌గా పని చేస్తున్న ఉప్పులూరు రవి (48) గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో జూలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎండాడకు చెందిన రవి 2010లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా చేరాడు. నాటి నుంచి నేటి వరకు జ్యూ క్యూరేటర్ల వద్ద కారు డ్రైవర్‌గా విధులు నిర్వహించాడు. ఆదివారం సాయంత్రం జూ నుంచి ఎండాడలో నివాసముంటున్న క్యూరేటర్ జి.మంగమ్మను కార్లో ఇంటి దగ్గర దించి తిరిగి వెళ్లే సమయంలో అక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు సపర్యలు చేసినా ఫలితం లేకపోవడంతో క్యూరేటర్ సాయంతో గీతం ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. రవికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతితో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. సోమవారం సమీప శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధితో దేశ ప్రగతి సాధ్యం

ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు



మాట్లాడుతున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య : గ్రామాల అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యపడుతుందని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. సోమవారం ఏయూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అసెంబ్లీ హాల్లో రాజనీతి-ప్రభుత్వ పాలన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రోల్ అండ్ రిలవెన్స్ ఆఫ్ ది పేర్లర్ బాడీస్ ఇన్ రూరల్ లోకల్ గవర్నమెంట్' జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సహకారంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి సదస్సులు నూతన జ్ఞానాన్ని, శక్తిని అందిస్తాయని చెప్పారు. సామాజిక న్యాయం, సామాజిక అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ హైదరాబాద్ గౌరవ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో జవాబుదారీతనం, పారదర్శకత మరింత పెరగాల్సిన అవసరం ఉందని చెప్పారు. సోషల్ సైన్సెస్ రంగంలో పరిశోధనలు అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా జరగాలన్నారు. మేజర్, మైనర్ రీసెర్చ్ ప్రాజెక్టులకు ఏయూ నుంచి ఆచార్యులు దరఖాస్తు చేయాలని సూచించారు. పరిశోధకులకు సైతం ఫెలోషిప్‌లు అందిస్తున్న విధానాన్ని వివరించారు. పెద్ద సంఖ్యలో రీసెర్చ్ ప్రాజెక్టులకు దరఖాస్తులు చేయాలని తెలిపారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఏయూ పూర్వ రెక్టార్ ఆచార్య ఇ.ఎ. నారాయణ, రీజనల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ టి.అనిల్ కుమార్, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఆచార్యులు ఎస్.ఆర్.సుభాని తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా సదస్సు ప్రత్యేక సంచికను వీసీ ఆవిష్కరించారు. సదస్సు కన్వీనర్ ఆచార్య పేటేటి ప్రేమానందం, కో డైరెక్టర్ టి.నాగరాజు, విభాగ అధ్యాపకులు డాక్టర్ జి.వీర్రాజు, డాక్టర్ వి.హరీష్ పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏ చీఫ్ ఇంజనీర్‌గా వినయ్‌కుమార్

బీచ్‌రోడ్డు: వీఎంఆర్డీఏ చీఫ్ ఇంజనీర్‌గా ఎం.వినయ్ కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీయూఎఫ్ఐడీసీలో చీఫ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వినయ్ కుమార్‌ను ఏడాది కాలం డిప్యూటేషన్‌పై వీఎంఆర్డీఏకి బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.87,060
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.79,800
వెండి(కిలో):	రూ.1,07,000

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

విశాఖ విద్య: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో 146 కేంద్రాల్లో ఉదయం జరిగిన పరీక్షలకు జనరల్, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 7,433 మంది విద్యార్థులు హాజరయ్యారు. 129 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 140 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 5,628 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షల్లో ఎటువంటి అవాంతరాలు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఆర్ఐవో పి.మురళీధర్ పరీక్షలను పర్యవేక్షించారు.

ఆప్కోస్ విధానం రద్దు చేస్తే ఆందోళన

జీవీఎంసీ ప్రధాన గేట్ వద్ద పెద్ద ఎత్తున అవుట్ సోర్సింగ్ కార్మికుల నిరసన



జీవీఎంసీ ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలుపుతున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు

డాబాగార్డెన్స్: ఆప్కోస్ విధానం రద్దు చేయవద్దంటూ జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ కార్మికులు రోడ్డెక్కారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వరంగ సంస్థల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు గత ప్రభుత్వం ఆప్కోస్ సంస్థ ద్వారా ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి..దళారీ వ్యవస్థ లేకుండా బ్యాంకు ద్వారా జీతం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించింది. అవుట్ సోర్సింగ్ కార్మికులకు భరోసాగా నిలిచింది. అటువంటి ఆప్కోస్ విధానాన్ని రద్దు చేస్తే సహించబోమంటూ జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహదేవ్ ఆనందరావు నేతృత్వంలో పలువురు కార్మికులు సోమవారం జీవీఎంసీ మెయిన్ గేట్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆప్కోస్ విధానం ద్వారా అవుట్ సోర్సింగ్ కార్మికులకు అండగా నిలిచిందని, ఈ విధానం వల్ల కార్మికులకు న్యాయం జరిగేదన్నారు. ఆప్కోస్ విధానం రద్దు చేసి, శాఖాపరంగా ఏజెన్సీలకు అప్పజెప్పే యోచనలో రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్టు వస్తున్న వార్తలతో ఆందోళన చెందుతున్నామన్నారు. ఆప్కోస్‌ను రద్దు చేయాల్సి వస్తే అంతకన్నా మెరుగైన వ్యవస్థను తీసుకురావాలని, లేదా వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఆప్కోస్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ (ఎంటీఎం) అమలు చేయాలన్నారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ బాట పట్టడం ఖాయమని ఆనందరావు హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రెల్లి సత్యం, సతీష్, రామకృష్ణ, ఈశ్వరరావు, ప్రసాద్, శ్రీను, కనకరాజు, జీవన్, శేఖర్, మోహన్‌రాజ, కృష్ణా, గురూజీ, రవి, శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జీతాలు పెంచండి మహాప్రభో..

జీవీఎంసీ వాటర్ సప్లై అవుట్ సోర్సింగ్ కార్మికులకు జీతాలు పెంచాలంటూ కార్మికులు ఆప్కోస్ మేనేజింగ్ డైరెక్టర్ జి. వాసుదేవరావుకు మెయిల్ పంపారు. ఈ విషయమై గత డిసెంబర్ 11న నిర్వహించిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు తీర్మానం చేసి విషయాన్ని మెయిల్ చేశామని, ఆ ఫైల్ పంపి 21 రోజులు గడిచినా ఇప్పటి వరకు ఎటువంటి స్పందన లేకపోవడం ఆవేదక కలిగిస్తోందని కార్మికులు పేర్కొన్నారు.

గల్లంతైన విద్యార్థి పవన్‌తేజ మృతదేహం లభ్యం



పవన్‌తేజ మృతదేహం వద్ద విలపిస్తున్న తండ్రి మల్లికార్జునరావు

రాంబిల్లి (యలమంచిలి) : రాంబిల్లి మండలం వాడపాలెం సముద్ర తీర ప్రాంతంలో ఆదివారం గల్లంతయిన ఇంజినీరింగ్ విద్యార్థి పవన్‌తేజ మృతదేహం సోమవారం లభ్యమైనట్టు రాంబిల్లి సీఐ సీహెచ్ నర్సింగరావు తెలిపారు. పవన్‌తేజ మృతదేహం వాడపాలెం సముద్ర తీరం సమీపంలో లభ్యం కావడంతో అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి పోలీసులు తరలించారు. అక్కడ సూర్యతేజ, పవన్‌తేజ మృతదేహాలకు పోస్టుమార్టం చేసి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్టు సీఐ తెలిపారు. విద్యార్థుల మృతదేహాలను వారి స్వగృహాలకు తరలించి బంధువులు, స్నేహితులు ఆశ్రునయనాల మధ్య అంత్యక్రియలు జరిగాయి. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.